క్లుప్తంగా

'చలపతి' విద్యార్థుల రక్తదానం



గుంటూరు రూరల్: అన్నిదానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయటం వల్ల ఆపదలో ఉన్న ఇద్దరి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలలోని విద్యార్థులు 100 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధినేత వైవీ ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు.

పవర్ లిఫ్టింగ్‌లో ముట్లూరు విద్యార్థుల ప్రతిభ



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులో మార్చి 30, 31 తేదీల్లో 67వ స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ పోటీలు రాష్ట్రస్థాయిలో జరిగాయి. పోటీల్లో 83వ విభాగంలో ముట్లూరు హైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థి టి.ఉదయ్ వెంకటకుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణపతకాన్ని, 59వ విభాగంలో పదవ తరగతి విద్యార్థి ఎస్.శ్రీనివాసరావు రజిత పతకాలను సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు టి.జోస్‌మేరి, పీడీ కుమారిలు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఉదయ్ వెంకట కుమార్ ఎంపికయ్యారని, త్వరలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం, పీడీలు తెలిపారు.

బెట్టింగ్‌లకు నిండుజీవితం బలి



గుంటూరు రూరల్: బెట్టింగ్‌లు, వ్యసనాలకు బానిసై అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన ఆటోడ్రైవర్ చల్లా రాజా(32) ఆటోను నడుపుకొంటూ జీవిస్తుంటాడు. ఈ క్రమంలో బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలయ్యాడు. దీంతో అతని మామ గుంటూరులోని సుబ్బారెడ్డినగర్‌లోగల తన నివాసం వద్ద ఇంటిని అద్దెకు ఇప్పించి రాజా, అతని భార్య, ఇరువురి పిల్లలతో కలిసి జీవించేలా ఆటోను ఇప్పించాడు. మళ్లీ బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాలకు రాజా ఆటోను సైతం అమ్ముకున్నాడు. దీంతో అప్పుల బాధలు ఎక్కువై మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అడ్డరోడ్డులో రూ.2.90 లక్షల నగదు స్వాధీనం

ద్విచక్ర వాహనంపై తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు



తాడికొండ: ఎలాంటి బిల్లులు లేకుండా నగదు తీసుకెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ. 2.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. ఎస్ఐ రవీంద్ర బాబు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా అమరావతి మండలం మునగోడు గ్రామానికి చెందిన షేక్ జానీబాషా తన బైక్‌లో రూ.2.90 లక్షల నగదు పెట్టుకొని వెళుతున్నాడు. విచారించగా అందుకు సంబంధించిన ఎలాంటి బిల్లులు లేవని తెలిపిన నేపథ్యంలో ఫ్లెయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నగదును ఐటీ అధికారులకు స్వాధీనం చేయనున్నట్లు సీఐ తెలిపారు.

చంద్రబాబు నిర్వాకంతో తిప్పలు



నడింపాలెం సచివాలయానికి నానా ఇబ్బందులు పడుతూ నడవలేని స్థితిలో వంగి వెళుతున్న వయో వృద్ధురాలు



ప్రత్తిపాడులో పింఛన్ల కోసం సచివాలయానికి వచ్చిన వృద్ధులు, లబ్ధిదారులు



ప్రత్తిపాడులో చేతికర్రలతో సచివాలయాలకు వెళ్లేందుకు వృద్ధుల అగచాట్లు



సచివాలయం వద్ద బల్లపై పడుకున్న వృద్ధురాలు

ప్రత్తిపాడు, పొన్నూరు: పింఛను కోసం వృద్ధులు పడిన అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. గత నెల వరకు అవ్వా.. తాత.. అంటూ ఒటకవ తారీఖునే ఇంటికొచ్చి తలుపుతట్టి పింఛను ఇచ్చిన వలంటీర్లు, ప్రతిపక్ష టీడీపీ, జనసేనల కుటిల రాజకీయంతో ఇప్పుడు సేవకు దూరమయ్యారు. గడప దాటకుండా ఇంటికే పింఛను వస్తుందన్న ఆనందం అవ్వాతాతల్లో ఆవిరయ్యింది. మండే ఎండలో షామియానాల కింద నీరసంగా నిరీక్షిస్తూ కనిపించారు. మెట్లపైన చతికిలబడి కొందరు.. నడవలేక నడుస్తూ ఇంకొందరు.. నీడపట్టున బల్లలపై పడుకుని మరికొందరు ఇలా వందల మంది లబ్ధిదారులు సచివాలయాల వద్ద కనిపించారు.

మా ఉసురు తగులుతుంది



ఇన్నాళ్లుగా మా ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడేమో ఇంటికి దూరంగా ఉన్న సచివాలయానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేను నడవలేని స్థితిలో ఉన్నాను. ఆయాసంతో కూర్చోలేకపోతున్నాను. ఇంత దుర్మార్గం చేస్తున్న చంద్రబాబుకు మా ఉసురు తప్పక తగుతుంది.

– మాణిక్యం, వృద్ధాప్య పింఛన్‌దారు

ఐదేళ్లు హాయిగా ఉంది..



జగనయ్య రాకముందు టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో కష్టాలు పడ్డాం. ప్రభుత్వ కార్యాలయాల వద్ద గంటల తరబడి ఎదురుచూసి పింఛన్ డబ్బులు తీసుకునే వాళ్లం. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మా కష్టాలు తీరాయి అనుకున్నాం. చంద్రబాబు చేసిన పనికి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.

– లక్ష్మీ కాంతమ్మ, వృద్ధాప్య పింఛన్‌దారు

పెద్దవాళ్లను ఇబ్బంది పెట్టిన వాళ్లు బాగుపడరు..



అనారోగ్యం కారణంగా కూర్చోలేకపోతున్నాను. చాలా దూరం నుంచి వచ్చాను. ఇన్నాళ్లు ఇంటికే పింఛన్ రావడంతో చాలా హాయిగా ఉంది. చంద్రబాబు దయ వలన కష్టాలు మొదలయ్యాయి. గత ఐదేళ్లుగా ఇంటికే పింఛన్ రావడంతో ఏ బాధ లేకుండా ఉండేది. పెద్దవాళ్లను ఇబ్బంది పెట్టిన వాళ్లు బాగుపడరు.

– పంచుమర్తి లక్ష్మీ ఈశ్వరమ్మ

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించం

ట్రైనీ డీఎస్పీ పి.గీత



ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రైనీ డీఎస్పీ గీత, సీఐ నిసార్‌బాషా

ప్రత్తిపాడు: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ట్రైనీ డీఎస్పీ పి.గీత అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో బుధవారం నోడల్ ఆఫీసర్, సీఐ నిసార్‌బాషా ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ గీత మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎలాంటి చిన్నపాటి వివాదాల్లో తలదూర్చినా కఠినంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని తెలిపారు. మీ వలన మీ కుటుంబాలు, పిల్లలు ప్రశాంతంగా ఉండలేని పరిస్థితులు రాకూడదని చెప్పారు. ఎన్నికల వివాదాల్లో పాల్గొనడం, రెచ్చగొట్టడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం వంటివి మానుకుని, సత్ప్రవర్తనను కలిగి ఉండాలని సూచించారు. సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఎలాంటి చిన్నపాటి పొరబాట్లు చేసినా ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు వివరించండి

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- పాత్తూరులో కార్యకర్తలకు దిశానిర్దేశం



పాత్తూరులో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త జగనన్న ప్రజలకు చేసిన మేలు, సంక్షేమం అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాత్తూరు గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. బూత్‌స్థాయిలో కార్యకర్తల బలోపేతం, ప్రచార ప్రణాళిక, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపే కార్యక్రమంలో భాగంగా పాత్తూరు గ్రామంలో ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కరోనా విపత్కర పరిస్థితుల్లో సైతం జగనన్న ప్రతి కుటుంబానికి చేసిన మేలును గడపగడపకు తిరిగి వివరించాలన్నారు. పేదలు, వృద్ధులకు, దివ్యాంగులకు జగనన్న పంచే పింఛన్‌ల విషయంలో సైతం చంద్రబాబు, అతని తొత్తులు కుట్రలు పన్నిన విషయాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా ఏ పార్టీ చేయని సంక్షేమం, అభివృద్ధి జగనన్న అధికారంలోకి వచ్చిన అనతి కాలంలో చేసి చూపాడని తెలిపారు. చంద్రబాబు 40 ఏళ్లలో ఏ మంచి పని ప్రజలకు చేశాడో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుది మునిగి పోయే పడవని అందుకే అన్ని పార్టీలను కట్టకట్టుకుని తన తోపాటు ముంచేందుకు సిద్ధమయ్యాడన్నారు. ప్రతి ఒక్కరం సమష్టిగా కృషిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేద్దామని పిలుపు నిచ్చారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల డైరెక్టర్‌లు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: లింగ వివక్షత విడనాడి, పురుషులతో పాటుగా మహిళలకు కూడా సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే దేశప్రగతిలో పురోగతి సాధించుకోవచ్చని హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెక్సువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్ (ప్రివెన్షన్, ప్రొహిబిషన్, అండ్ రిడ్రెస్సల్) యాక్ట్, 2013 అనేఅంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను తెలియజేశారు. భారత రాజ్యాంగ నిర్మాణం మొదలు నేటి వరకు స్త్రీల రక్షణ కోసం తీసుకొచ్చిన వివిధ చట్టాల గురించి వివరించారు. దేశ పాలనలో అగ్ర పీఠమైన ప్రధానమంత్రి, రాష్ట్రపతి వంటి పదవీ బాధ్యతల్లో తమ శక్తిని నిరూపించుకుంటూ, ఇస్రో, అంతరిక్ష పరిశోధనలతో పాటుగా వ్యోమగాములుగా విజయపథంలో దూసుకుపోతున్న తరుణంలో కూడా కొన్ని చోట్ల లింగ వివక్షత భేదాలు చూడటం విచారకరమన్నారు. లింగ సమానత్వం చూపినప్పుడే సమ సమాజ నిర్మాణానికి నాంది పలుకవచ్చని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో అతిథులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్‌రావు, డాక్టర్ జి.సుధావాణి తదితరులు ఘనంగా సన్మానించారు.

జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ముసుగులు తొలగించాలి

మంగళగిరి: సమాజంలో పేద బడుగు, బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాడిన మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఈ నెల 5వ తేదిన ఘనంగా జరుపుకోవాలని బహుజన నాయకులు కోరారు. పట్టణంలో ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు శావల థామస్, ఈపూరి ఆదామ్‌లు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహాలకు వేసిన ముసుగులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5 వ తేదీన పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిర్వహించే జయంతి కార్యక్రమంలో బహుజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జాలాది నాగేశ్వరరావు, కుంచాల కృష్ణ కిషోర్, వడ్డేశ్వరపు రజనీకాంత్, మీనిగ ఆంజనేయులు, పులివర్తి రాంబాబు, సాలి ప్రశాంత్, చిలకా విక్టర్ ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



ప్రత్తిపాడులో ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు



కుర్నూతలలో రాజీనామా పత్రాలను అధికారులకు అందిస్తున్న వలంటీర్లు

ప్రత్తిపాడు: తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు వలంటీర్ల వ్యవస్థను హేళన చేస్తూ, నీచాతి నీచంగా మాట్లాడుతున్నారు. మరో పక్క ఆ పార్టీల నేతలు ఎన్నికల కోడ్ పేరుతో మమ్మల్ని వెంటాడుతూ, వేధింపులకు గురి చేస్తున్నారు. చివరికి బంధువుల ఇంటికి వెళ్లినా.. తోబుట్టువులతో మాట్లాడినా.. ఫొటోలు తీస్తూ మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు. అందుకే ఈ వేధింపులు తట్టుకోలేక మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నాం. ఇదీ ప్రత్తిపాడులో వలంటీర్ల ఆవేదన..

టీడీపీ, జనసేన నాయకుల వేధింపులు తట్టుకోలేక నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. మొత్తం ప్రత్తిపాడు పంచాయతీలో 65 మంది వలంటీర్లు ఉండగా, వారిలో అందుబాటులో ఉన్న 53 మంది స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్‌ను కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. రాజీనామాలకుగల కారణాలు ఏమిటని ఎంపీడీఓ వారిని ప్రశ్నించారు. గడిచినఐదేళ్లుగా కులమతాలు, పార్టీలు, వర్గాలు చూడకుండా నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేశామని, కానీ నేడు మా పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తూ, టీడీపీ, జనసేన నాయకులు హీనంగా మాట్లాడుతున్నారన్నారు. అంతేకాకుండా పింఛన్లకు సేవ చేయలేనప్పుడు మాకు ఈ ఉద్యోగం ఉన్నా ఒక్కటే లేకున్నా ఒక్కటేనని, బంధువులు, తోబుట్టువుల ఇళ్లకు కూడా వెళ్లలేకపోతున్నామని అందుకే రాజీనామాలు చేస్తున్నామని వలంటీరుల ఎంపీడీఓకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన పంచాయతీ సెక్రటరీకి రాజీనామా పత్రాలు అందజేయాలని కోరారు. దీంతో వారు ప్రత్తిపాడు సెక్రటరీ జాన్‌పీరాకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఆయన ఎంపీడీఓకు నివేదిక రూపంలో ఆమోదం కోసం పంపనున్నట్లు తెలిపారు.

వట్టిచెరుకూరు మండలంలో ...

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలంలోని రెండు గ్రామాల్లో వలంటీర్లు స్వచ్ఛందంగా మూకుమ్మడి రాజీనామాలు చేశారు. మండల పరిధిలోని గారపాడు సచివాలయంలో వలంటీర్లుగా సేవలందిస్తున్న 16 మంది, కుర్నూతల గ్రామ సచివాలయంలో వలంటీర్లుగా చేస్తున్న ఎనిమిది మందిలో ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేయగా, మరో వలంటీరు నేడు రాజీనామా చెయ్యనున్నారు. ఈ మేరకు రాజీనామాలను ఆయా సచివాలయాల సెక్రటరీలకు వలంటీర్లు అందజేశారు.

పాలిసెట్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



పాలిటెక్నిక్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగరాణి

గుంటూరు రూరల్: పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా టెక్నికల్ విద్యను త్వరితగతిన పూర్తి చేసుకుని త్వరగా ఉపాధిని పొందేందుకు అవకాశాలుంటాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన పాలిసెట్–2024 ఉచిత శిక్షణా శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉన్నతమైన విద్యను అందించి వారి ఉన్నతికి కృషిచేయటం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న 150 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాలిటెక్నిక్ కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా విద్యార్థులకు లభించే అవకాశాలు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్స్ కె.రమణబాబు, జానకీరామ్, కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువును ఆచరణలోకి తెచ్చినప్పుడే విజ్ఞానాభివృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో చదువును ఆచరణలోకి తెచ్చినప్పుడే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇన్నోవేషన్ ఫెయిర్–2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో సృజనాత్మక ఆలోచనలు కచ్చితంగా ఉంటాయని, వాటిని వెలుగులోకి తీసుకురావడంలో ఇటువంటి సాంకేతిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి పరచి, నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించడంలో కళాశాలల యాజమాన్యాలు కృషి చేయాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు వివరణాత్మక, విశ్లేషణ సామర్థ్యం ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఇన్నోవేషన్ ఫెయిర్‌లో భాగంగా ప్రాజెక్టు ఎక్స్‌పో, పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజక్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కన్వీనర్ ఎస్. కృష్ణార్జునరావు, కో–కన్వీనర్లు ఐ. నాగాంజనేయులు, కె. సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఒంటిపూట బడులు హర్షణీయం

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నేటి నుంచి ఒంటి పూట బడులకు ఉన్నతాధికారులు ఉత్తర్వులివ్వడం హర్షణీయమని ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి తెలిపారు. మార్చిలోనే ఎండలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని ఒంటిపూట బడులను అమలు చేయాలంటూ ఫోరమ్ ఫర్ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ యూనియన్ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వెట్రిసెల్వితో పాటు ఆర్‌జేడీలను పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ తరుణంలో ఉన్నతాధికారులు స్పందించి ఒంటిపూట బడులపై ఉత్తర్వులు జారీ చేయడంపై జ్యోతిరాణితో పాటు యూనియన్ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: పలు చోరీ కేసుల్లో నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ విజయచంద్ర బుధవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన కోనూరి శ్రీనివాసరావు గతంలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ దొంగ బంగారం విక్రయించి పెట్టడంతో ఓ వ్యక్తికి సహాయపడి అరెస్టు అయి జైలుకు వెళ్లాడు. 2023 సెప్టెంబరులో మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో, అదే నెలలో గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో, 2024 మార్చిలో పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో చోరీలు చేశాడు. అదే నెలలో పొన్నూరు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు చోరీలు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం నిందితుడు శ్రీనివాసరావును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ద్విచక్రవాహనం, 39 గ్రాముల బంగారు, 353 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించారు.

ఓటు వేయడం ప్రతిఒక్కరి బాధ్యత

గుంటూరు ఎడ్యుకేషన్: సమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కుల్లో ఓటుహక్కు ప్రముఖమైందని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోవడంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. కళాశాల రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు పి. కుమార్ రాజా మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత ఓటు ఎంతో కీలకమని తెలిపారు. ఓటు వేయడంతో పాటు చుట్టూ ఉన్నవారిని వేసే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి జేవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్. జయ శైలజ, లక్ష్మీదీప్తి, చంద్రశేఖర్, వేణు, వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి పడి వృద్ధురాలికి గాయాలు



తెనాలిరూరల్: అపార్ట్‌మెంట్ నుంచి పడి వృద్ధురాలు తీవ్ర గాయాల పాలైన ఘటన తెనాలిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ కొత్తపేటలోని అష్టలక్ష్మి గుడి పక్కన ఉన్న అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో 65 ఏళ్ల బెజవాడ త్రివేణి తన కుటుంబంతో నివసిస్తోంది. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె ప్రమాదవశాత్తు పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైంది. ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం తాడేపల్లిలోని వైద్యశాలకు పంపారు. వన్‌టౌన్ పోలీసులు త్రివేణి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

తెనాలి రూరల్: సంగం జాగర్లమూడి శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. సుబ్బరత్నమ్మ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎక్కువ మంది పాఠకులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవటంతో పాటు గ్రంథాలయాన్ని వినియోగించుకునే విధంగా చేయాలని గ్రంథాలయాధికారి జమ్ముల వెంకటేశ్వరరావును ఆదేశించారు. గ్రంథాలయ సేవలు అందుతున్న తీరుపై పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణం చేపట్టడానికి స్థల సేకరణ కోసం ప్రయత్నం చేయాలని గ్రంథాలయాధికారిని ఆదేశించారు.